క్లుప్తంగా

ఎల్టా పోటీలు విజయవంతం

కాళోజీ సెంటర్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నిర్వహించిన ఆంగ్ల ప్రావీణ్యంతో పాటు వివిధ రకాల పోటీలు విజయవంతమైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వంగర లక్ష్మణ్ తెలిపారు. జిల్లాలోని 13 మండలాల్లోని విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 14న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పలువురిని ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై షాపుల నిర్వహణకు వేలం

మడికొండ: మహాశివరాత్రి సందర్భంగా మెట్టుగుట్టపై షాపుల నిర్వహణకు ఫిబ్రవరి 8వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ శేషుభారతి ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా తొమ్మిది రోజుల పాటు కొబ్బరికాయలు, పులిహోర, కొబ్బరి చిప్పల సేకరణ, పంచామృతాల విక్రయం, వాహనాల పార్కింగ్, చెరుకు బండి నడుపుకొనేందుకు ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఆలయ కార్యాలయంలో ధరవత్తు చెల్లించి టెండర్ ఫారంతో వేలంలో పాల్గొనాలని సూచించారు.

పీఎంఎఫ్ఎంఈపై అవగాహన

కరీమాబాద్: వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పీఎంఎఫ్ఎంఈపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉమారెడ్డి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మేనేజర్ ఆకాశ్ పాల్గొని సేంద్రియ వ్యవసాయం, సాగు సమస్యలు, చిరుధాన్యాల వ్యాపారం వంటి పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన ఎఫ్పీఓలు పాపారావు, సరిత, రామగోవింద్, డాక్టర్ మధు, డాక్టర్ రాములు, సుష్మిత పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



హసన్‌పర్తి: చిన్ననాటి స్నేహితురాలికి స్నేహితులు అండగా నిలిచారు. భర్త చనిపోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్నేహితురాలికి తమ వంతు సాయం చేశారు. సిద్ధాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2000 -2001లో ఎస్ఎస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి స్వప్న భర్త ఎండీ.యాకుబ్‌షాపా అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందారు. ఈమేరకు బాధితురాలికి రూ.50,500ల ఆర్థిక సాయం అందించారు.

వరంగల్ ఎంపీగా పోటీ చేస్తా..



వరంగల్ చౌరస్తా: వరంగల్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తానని, ఈమేరకు గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు కాంగ్రెస్ నేత రాగమళ్ల పరమేశ్వర్ తెలిపారు. వరంగల్ హంటర్‌రోడ్డులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఒక నియంత అని, రేవంత్ రెడ్డి ఒక లీడర్ అని అన్నారు. ఈ సమావేశంలో మఠ్రి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అమీర్‌కు అభినందనలు

న్యూశాయంపేట: ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన సియాసత్ ఉర్దూ దినపత్రిక ఎడిటర్ అమీర్ అలీఖాన్‌ను తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు హైదరాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. జర్నలిస్టుల సమస్యలపై మండలిలో తమ వాణి వినిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్, ఎంఏ నయీం, నిజాముద్దీన్ ఖాజా, అజీముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'లో ఫీజుల దోపిడీ



హన్మకొండ అర్బన్: జిల్లాలో కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని, అలాంటి విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించాలని, స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు రమేష్, ఉదయ్, సాయి, శ్రీనాథ్, ప్రణయ్ పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలు

ఆగుతూ.. సాగుతూ.. అసంపూర్తిగా అభివృద్ధి పనులు

- కానరాని నాణ్యతా ప్రమాణాలు
- రాజకీయ నేతల ఏజెన్సీలతోనే ఆలస్యం
- మారిన నేతలతో 'తూర్పు' రాత మారేనా?



ఏనుమాముల - నర్సంపేట బైపాస్ 100ఫీట్ల రోడ్డుపై డ్రెయినేజీ నిర్మాణం కోసం తెచ్చిన పైపులు



పోచమ్మమైదాన్ జంక్షన్‌లో వ్యర్థాలతో నిండిపోయిన డ్రెయినేజీ



అబ్బాస్ ఫంక్షన్ హాల్ సమీపంలో అసంపూర్తిగా ఉన్న మురుగునీటి కాల్వ నిర్మాణం

వరంగల్: నగరాభివృద్ధి కోసం వివిధ పథకాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఆగుతూ.. సాగుతూ..అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. నిధులు విడుదలై టెండర్లు నిర్వహించినా పనులు గ్రౌండింగ్ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ నుంచి పలు పథకాల్లో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అభివృద్ధి పనుల కోసం వందల కోట్ల రూపాయలు విడుదలయ్యాయి. స్మార్ట్ సిటీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక ప్రైవేటు కన్సల్టెంట్ ఏజెన్సీని ఏర్పాటు చేసినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. దీనికి కారణం పనులు పొందిన కాంట్రాక్ట్ ఏజెన్సీలన్నీ గత రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులకు చెందినవి కావడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. వరంగల్ - నర్సంపేట రహదారి నుంచి ఏనుమాముల మార్కెట్ వరకు చేపట్టిన 100ఫీట్ల బైపాస్ రోడ్డు బాలాజీ నగర్ జంక్షన్ వరకు, జంక్షన్ నుంచి దేశాయిపేట జంక్షన్ వరకు రహదారుల పనులు జరిగినా ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మించలేదు. బాలాజీనగర్ జంక్షన్ అభివృద్ధి సైతం మూడేళ్లుగా అసంపూర్తిగా ఉన్నప్పటికి ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా పూర్తి చేశారు. ఇరువైపులా వేయాల్సి పైపులు రోడ్డు మధ్యలో అలంకారప్రాయంగా మిగిలిపోయాయి.

మూడేళ్లు అవుతున్నా..

వెంకట్రామ జంక్షన్ నుంచి పోచమ్మమైదాన్ మీదుగా ఎంజీఎం జంక్షన్ వరకు సుమారు రూ.46 కోట్ల వ్యయంతో స్మార్ట్ సిటీ పథకంలో చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులు మూడేళ్లు అవుతున్నా నేటికీ పూర్తి కాలేదు. ఈ రహదారికి ఇరువైపులా పుట్‌పాత్‌లు నిర్మించేందుకు భవనాల ఎదుట ఆక్రమణలు తొలగించిన ఇంజనీర్లు.. నేటికి ఫ్లాట్‌ఫాంలు పూర్తి చేయకపోవడంతో రహదారి పక్కన ఉన్న షాపుల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డీమార్ట్ ఎదుట ఉన్న పుట్‌పాత్ పనులు 2020 ఫిబ్రవరిలో మొదలు పెట్టినా నేటికి పూర్తి చేయలేదు. దాంతో షాపుల్లోకి వినియోగదారులు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు సాగడంలేదు..

గోపాలస్వామి గుడి జంక్షన్ సమీపంలోని రహదారి అభివృద్ధి కోసం అధికారులు చేసిన ప్రయత్నాలు ఒక ఎమ్మెల్సీ కారణంగా ముందుకు సాగలేదు. చివరకు అధికారులు పోలీసు బలగాలను మోహరించి కొంత మేర కూల్చివేసినా అప్పటి బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడు జోక్యం చేసుకోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ రహదారికి ఇరువైపులా అండర్ డ్రెయినేజీ నిర్మాణం కోసం పైపులు వేసిన అసంపూర్తిగా ఉండడం వల్ల వర్షం పడితే చాలు రహదారి మొత్తం జలమయంగా మారుతోంది. రోడ్డు పూర్తికాకపోవడంతో డ్రెయినేజీ పనులు చేపట్టకపోవడంతో ఉన్న కాల్వలు నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి.

పార్టీ నాయకుల అండతో..

స్మార్ట్ రోడ్డులో భాగంగా రహదారిపై బీటీ లేయర్లు అక్కడక్కడ అసంపూర్తిగా వేయడంతో అవి స్పీడ్ బ్రేకర్లుగా మారి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిలో అక్కడక్కడ వెడల్పు చేసేందుకు అప్పటి బీఆర్ఎస్ అధికార పార్టీ నాయకుల అండతో భవనాల యజమానులు అడ్డుగా మారడం కూడా ఈ పనుల జాప్యానికి కారణంగా చెప్పవచ్చు.

కలెక్టర్, కమిషనర్ ఆదేశించినా..

స్మార్ట్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మేయర్, జిల్లా కలెక్టర్, కమిషనర్లు ఇంజనీరింగ్ అధికారుల రివ్యూ సమావేశాల్లో ఆదేశాలు జారీ చేస్తున్నా.. క్షేత్ర స్థాయిలో ఉన్న అడ్డంకులు, రాజకీయ జోక్యం వల్ల సాధ్యం కావడం లేదని అధికారులు వాపోతున్నారు. అసంపూర్తిగా పనుల కారణంగా బిల్లులు చెల్లించకపోవడంతో పనులు పూర్తిచేయలేక పోతున్నామని కాంట్రాక్ట్ ఏజెన్సీలు ప్రచారం చేస్తున్నాయి. జరిగిన పనుల్లో సైతం నాణ్యత ప్రమాణాలు లేకపోవడంతో బిల్లులు చేసేందుకు ఇంజనీర్లు జంకుతున్నట్లుగా తెలుస్తోంది. పాత నాయకుల కనుసన్నల్లోనే ఉన్న కాంట్రాక్ట్ ఏజెన్సీలు మారినా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం వల్ల పనులు పూర్తి అవుతాయా.. లేదా అన్న అనుమానాలను నగరవాసులు వ్యక్తం చేస్తున్నారు.

నగరంలోని రోడ్ల దుస్థితి..

- వెంకట్రామ జంక్షన్ నుంచి ములుగురోడ్డు జంక్షన్ వరకు చేపట్టిన స్మార్ట్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. అదే విధంగా కాశిబుగ్గ, పోచమ్మమైదాన్, వరంగల్ చౌరస్తాల్లో చేపట్టిన జంక్షన్ అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించడం లేదు.
- పోచమ్మమైదాన్ నుంచి రైల్వేస్టేషన్ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు అడ్డదిడ్డంగా పూర్తి చేసినా ఇరుపక్కలా నిర్మించాల్సిన ఫుట్‌పాత్‌లు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ఈ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న రోడ్లు ఎత్తు తక్కువగా ఉండడం వల్ల ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- వరంగల్ – నర్సంపేట రోడ్డు నుంచి గరీబ్ నగర్ మీదుగా వ్యవసాయ మార్కెట్ వరకు చేపట్టిన 100ఫీట్ల రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం కోసం పైపులు తెచ్చి ఏడాది దాటింది.

రెండున్నరేళ్లుగా ఇబ్బంది



రెండున్నరేళ్ల క్రితం రోడ్డు అభివృద్ధి కోసం భవనంలో కొంత భాగం కూల్చివేశారు. పుట్‌పాత్ నిర్మిస్తామని చెప్పి నేటికి పూర్తిచేయకపోవడంతో షాపులోకి వినియోగదారులు రావడం లేదు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నాం. - విజయ్, సెలూన్ నిర్వాహకుడు

రోడ్లన్నీ గుంతలమయమే



వరంగల్‌లో రోడ్లు అన్ని గుంతలమయంగా తయారయ్యాయి. అభివృద్ధి చేస్తున్నామని అంటున్నారే తప్ప ఎలాంటి మార్పు కనిపించడం లేదు. గుంతల వల్ల వాహనాలు చెడిపోతున్నాయి.

- సునీల్, కాశిబుగ్గ

సీఐటీయూ సభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కాజీపేట మున్సిపల్ కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాజీపేట: ఆల్ ఇండియా వర్కింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 31నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరగనున్న సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు. ఈమేరకు కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మహాసభల వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ సభకు నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు, ప్రజలు తరలిరావాలని కోరారు. పలు డిమాండ్ల సాధనకు సమావేశంలో చర్చించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వేల్పుల ధర్మరాజు, సంఘం జిల్లా అధ్యక్షుడు బరుపాట్ల మహేష్, కార్మికులు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్ ఆవరణలో..



వరంగల్: బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్: ఈనెల 31వ తేదీన హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఏనుమాముల మార్కెట్ ఆవరణలో కాశిబుగ్గ ఏరియా సీఐటీయూ కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా సీఐటీయూ జాతీయ కార్యదర్శి తపన్‌సేన్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మాజీ కార్యదర్శి బీవీ.రాఘవులు హాజరవుతారని తెలిపారు. ఈక్రమంలో కార్మికులు, ప్రజలు బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ ఏరియా సీఐటీయూ నాయకులు కంది రవి, ఎస్కే.పాషా, జన్ను ప్రవీణ్, జన్ను చిట్టి, ఏనుగంటి రాజలింగం, జన్ను అఖిల్, జనగాం నాగరాజు, శ్రీను, అనిత, మంజుల, సమ్మక్క, గౌస్‌పాషా, మనీలా, శివాజీ, తిరుపతి, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

దర్గా ఉత్సవాలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న పీఠాధిపతి నవీద్‌బాబా

కరీమాబాద్: ఉర్సు దర్గా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబా తెలిపారు. కరీమాబాద్ ఉర్సు దర్గాలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 468వ ఉర్సు దర్గా (హజ్రత్ సయ్యద్ జలాలుద్దీన్ షా జమాలులర్ బహర్), (సయ్యద్ మాషుక్ రబ్బానీ) ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 2న ఉర్సు నయా ఘడీ నుంచి గంధం తీసుకువచ్చి పవిత్ర సమాధికి గంధలేపనం చేయనున్నట్లు తెలిపారు. దీంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు. 3న ఉర్సు ఉత్సవాలు, 4న ఉత్సవాల ముగింపు ఉంటుందని వివరించారు. ఉత్సవాల సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇస్లామిక్ పండితులతో ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు ఉత్సవాలను విజయవంతం చేయాలని నవీద్ బాబా, ఉబేద్‌బాబా కోరారు. సమావేశంలో సైలానీబాబా, చాంద్‌పాషా, మగ్దూం, గడ్డం యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధకులకు ఫెలోషిప్ ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న కుర్సా బాధ్యులు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లోని పరిశోధక విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫెలోషిప్ ఇవ్వాలని, ప్రభుత్వ యూనివర్సిటీల్లో పరిశోధనలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ (కుర్సా) అధ్యక్షుడు ఉషన్‌నాయక్ కోరారు. ఈమేరకు రాష్ట్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌కు ముల్కనూరులో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉషన్‌నాయక్ మాట్లాడుతూ ఒడిశా, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ పథకాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుర్సా జనరల్ సెక్రటరీ కళ్లెపల్లి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు జానకీరామ్, కోశాధికారి అంగడి సతీష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వైద్య మండలి సభ్యుడికి సన్మానం



నరేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఖిలా వరంగల్: తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి సభ్యుడిగా ఎన్నికైన వరంగల్ ఫోర్ట్‌రోడ్డుకు చెందిన డాక్టర్ నరేష్ కుమార్‌ను రాష్ట్ర వైద్య మండలి కార్యవర్గం, రాష్ట్ర ఐఎంఏ ప్రతినిధులు సన్మానించారు. హైదరాబాద్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో సోమవారం ఐఎంఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ వైద్య మండలి సభ్యులకు శాయశక్తులా సేవలందిస్తానని తెలిపారు. మండలి బలోపేతానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ అశోక్ రెడ్డి, సెక్రటరీ డాక్టర్ విజయ్‌రావు, కోశాధికారి రాజేంద్ర కుమార్‌యాదవ్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ సంధ్యారాణి, మాజీ అధ్యక్షులు డాక్టర్ విజయ చందర్‌రెడ్డి, డాక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అమృత్' అవార్డు గ్రహీతకు అభినందన



మత్యాస్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, స్నేహితులు

హన్మకొండ: జాతీయ స్థాయిలో సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గోప్ప మత్యాస్‌రెడ్డిని ఉత్తరప్రదేశ్ మంత్రి చౌదరి లక్ష్మీనారాయణ సన్మానించారు. అవంతిక ఏ గ్రూప్ ఆఫ్ కాంటెంపరరీ ఆర్టిస్ట్ – ఇంటలెక్చువల్ కలరింగ్ కాంపిటీషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవంతిక డ్రాయింగ్ కాంపిటీషన్‌లో హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా అమృత్ మహోత్సవ్ అవార్డు ప్రకటించి ఈనెల 25న న్యూఢిల్లీలోని హిందీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మత్యాస్‌రెడ్డిని సన్మానించారు. అమృత్ మహోత్సవ్ అవార్డు అందుకున్న సందర్భంగా హనుమకొండలోని స్కూల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మత్యాస్‌రెడ్డి, డైరెక్టర్ సునీతరెడ్డి దంపతులను ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాది గుడిమల్ల రవికుమార్, సామాజికవేత్త చిలువేరు శంకర్, డ్రాయింగ్ టీచర్ రాపోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



హసన్‌పర్తి: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈమేరకు హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారిలో చర్యలకు ఉపక్రమించారు. పలు ప్రాంతాలను డేంజర్ జోన్లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో రేడియంతో కూడిన డివైడర్లను ఏర్పాటు చేసినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపుతూ పట్టుబడితే జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు.

సంకటహర చతుర్థి పూజలు



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురికాలనీలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో సంకటహర చతుర్థి పూజలను సోమవారం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో శ్వేతార్కుడికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పూజలో పాల్గొన్నారు. అనంతరం, భక్తులకు అన్నపూర్ణ భవనంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వర్లు శర్మ, సాయికృష్ణ శర్మ, ఆలయ ఇన్‌చార్జ్ గంగుల రాజిరెడ్డి, దేవులపల్లి సదానందం, శనిగరపు రాజ్‌మోహన్, అర్చకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఇంజనీర్ల డైరీ ఆవిష్కరణ

హన్మకొండ కల్చరల్: ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. రాంనగర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ (టాస్కా) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొన్నాల రామయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. టాస్కా ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కేశవాచారి, సంయుక్త కార్యదర్శులు కొండల్‌రావు, రాజమౌళి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సిద్దోజు విద్యాసాగర్, కార్యవర్గ సభ్యులు యాకిరెడ్డి, ప్రకాశ్‌చారి, జనార్దన్‌రావు, రాఘవులు, సుకుమార్ రెడ్డి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'వడుప్సా' క్రీడాపోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా వడుప్సా ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, 100 మీటర్ల పరుగు పందెం పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేయాల్సి ఉండగా వారంరోజుల పాటు వాయిదా వేశారు. కార్యక్రమంలో షణ్ముకచారి, తాళ్ల మల్లేశం, తాళ్ల వంశీ, చైతన్య, రమణారెడ్డి, తక్కళ్లపల్లి బుచ్చిబాబు, శంకర్, వేణుమాధవరావు, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

సత్వరమే సమస్యలు పరిష్కరించాలి



హనుమకొండ: సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



వరంగల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో ప్రజలనుంచి వివిధ సమస్యలపై స్వీకరించిన దరఖాస్తులను ఆయా శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె హాజరై ప్రజలనుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల్లో అధికారులు అలసత్వం వహించవద్దన్నారు. పెండింగ్ దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 120 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌కుమార్, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ ప్రజావాణిలో 103 దరఖాస్తులు

కరీమాబాద్: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడె దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 103 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. అలాగే హైదరాబాద్ ప్రజావాణిలో వచ్చిన 225 దరఖాస్తులను కూడా ఆయా శాఖల అధికారులకు బదలాయించినట్లు అదనపు కలెక్టర్ చెప్పారు. వరంగల్ నగర సమీపంలోని ఏనుమాముల మార్కెట్ సమీపంలోని రెడ్డిపాలెంలో ఓ నెట్‌వర్క్‌కు చెందిన సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపేయాలని రెడ్డిపాలెం గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తన భర్త అహ్మద్‌అలీ జిల్లా వెల్ఫేర్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తూ 2021లో మరణించాడని, ఆ ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని వరంగల్‌కు చెందిన అక్బర్ బీ విజ్ఞప్తిచేసింది. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు వాసుచంద్ర, కృష్ణవేణి, డీఆర్‌డీఓ సంపత్‌రావు, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

రామన్నపేట: భారతీయం -2024 ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ఎల్‌బీ కళాశాలలో విద్యార్థినులకు సోమవారం ఫ్యాన్సీడ్రెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాన్సీ డ్రెస్‌లో వారు అలరించాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కుంటరాజు వ్యవహరించగా, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను పలువురు అభినందించారు. అనంతరం వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు, కల్చరల్ కమిటీ కన్వీనర్ సుధాకర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కల్చరల్ కమిటీ విభాగం సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.